సాక్షి నంద్యాల

సోమవారం ׀ 18 ׀ డిసెంబర్ ׀ 2023




కేసీకి 159 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం : శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. క్యూలైన్లు కిక్కిరిసి ఉండటంతో స్వామి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

న్యూస్‌రీల్

సమష్టి కృషితోనే అవార్డు



డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జిల్లా పోలీసుల సమష్టి కృషితోనే డీజీపీ డెస్క్ కమెండేషన్ అవార్డును సాధించగలిగామని ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విభాగం, దిశ, కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్‌లో ఉత్తమ పనితీరును కనబరిచినందుకు రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం అమరావతిలో అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గత ఏడాది జూన్ నుంచి డీజీపీ ఆదేశాల మేరకు కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేశామన్నారు. జిల్లాలో ప్రతి రోజు ప్రధానమైన ఐదు నుంచి ఆరు కేసులను పర్యవేక్షించామన్నారు. కోర్టులో జరుగుతున్న కేసు విచారణ పురోగతిపై షెడ్యూల్ మేరకు సమీక్షించాలా సిబ్బంది అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా ఈ ఏడాది తీవ్ర నేరాలకు పాల్పడిన నిందితులకు శిక్షలు పడేలా ఆధారాలు కోర్టుకు సమర్పించామని వివరించారు. దీంతో ఈ ఏడాది తీవ్రమైన నేరాలు గతంలో పోలీస్తే చాలా వరకు తగ్గాయన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం - స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపటి నుంచి వ్యవసాయ కళాశాలల క్రీడా పోటీలు



మహానంది: మహానంది సమీపంలోని వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో ఈనెల 19వ తేదీ నుంచి అంతర రాష్ట్ర స్థాయి వ్యవసాయ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ ఆదివారం తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల ప్రారంభానికి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ సాంబశివరావు, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

పేదలకు ఆరోగ్యశ్రీరస్తు

- ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- 3,257 రోగాలకు వైద్యసేవలు
- నాలుగున్నరేళ్లలో రూ.115.69 కోట్ల విలువైన శస్త్ర చికిత్సల నిర్వహణ
- నేటి నుంచి కొత్త కార్డులు జారీ చేయనున్న ప్రభుత్వం

'కులం చూడం.. మతం చూడం... ప్రాంతం చూడం.. వర్గం చూడం.. అందరికీ ఆరోగ్యమే మా అభిమతం' ఈ మాటలను అక్షరాలా సీఎం జగనన్న ప్రభుత్వం నిజం చేస్తోంది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో పేదల ఆరోగ్యానికి రెట్టింపు భరోసానిస్తోంది. ప్రజలందరికీ అత్యుత్తమ వైద్యాన్ని అందుబాటులోకి తేవడంతో పాటు ఆరోగ్యశ్రీని మరింత ఉన్నతంగా అందించేందుకు మరింత మెరుగులు దిద్ది అమలు చేయనుంది. నేటి నుంచి నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

నంద్యాల: పేదవాడు కార్పొరేట్ ఆసుపత్రి కాదు కదా కనీసం సాధారణ ప్రైవేటు హాస్పిటల్‌కు కూడా వెళ్లలేని పరిస్థితుల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారు. ఆరోగ్యశ్రీ కార్డు జేబులో ఉంచుకున్ని ఎంతటి పెద్ద కార్పొరేట్ ఆసుపత్రికి అయినా ధీమాగా వెళ్లి చికిత్స అందుకునేలా సౌకర్యాన్ని కల్పించారు. ఆ పథకాన్ని ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మరింత చేరువ చేశారు. జిల్లాలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది పేద, మధ్యతరగతి వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. దీంతో ఈ పథకం రాష్ట్రంలోనే గాక ఇతర రాష్ట్రాలు సైతం ఆచరించే విధంగా ఆదరణ పొందింది. అయితే వైఎస్ఆర్ మరణించిన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు. టీడీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఈ పథకం మరింత పడకేసింది. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పేదలకు మెరుగైన వైద్యం దూరమైంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే తండ్రికి తగ్గ తనయుడిలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి పునరుజ్జీవం పోశారు. చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్య భాగ్యం కల్పించారు. పేదలపై వ్యయ భారం ఉండకూడదని ప్రస్తుత పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పేదలకు ఆరోగ్యశ్రీ మరింత రక్షగా నిలవనుంది. పెద్ద పెద్ద ఆపరేషన్లు సైతం కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా చేయించుకోవచ్చు.



ఆరోగ్యశ్రీ కియోస్క్(హెల్ప్‌డెస్క్)

3,257 రోగాలకు వైద్య సేవలు ఉచితం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ సేవలను విస్తృతం చేశారు. మొత్తం 3,257 వ్యాధులను పథకం పరిధిలో చేర్చి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే శస్త్ర చికిత్సలు చేయించుకున్న అనంతరం రోగులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకునేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. శస్త్రచికిత్స చేయించుకున్న అనంతరం వారు కోలుకునే వరకూ రోజుకు రూ.225 వంతున ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకంలో 1,519 వ్యాధులను చేర్చారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 5.40 లక్షల కుటుంబాలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులున్నాయి. ఈ క్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద సేవలందిస్తున్న ఆస్పత్రులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తూ పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది. ఇందుకోసం జిల్లాలో నాలుగున్నరేళ్లుగా రూ.115.69 కోట్లు ఖర్చు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2020–21లో 29,730 వైద్య సేవలకు రూ.16.37 కోట్లు, 2021–22లో 61,295 మంది వైద్య సేవలకు రూ.28.76 కోట్లు చెల్లించారు. 2022–23లో 86,953 మందికి రూ.44.12కోట్లు, 2023–24లో 52,721 మందికి రూ.26.44కోట్లు మొత్తం 2,30,699మంది వైద్య సేవలకు రూ.115.69 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.



ఆరోగ్యశ్రీ కొత్త కార్డు

గత టీడీపీ హయాంలో..

తెలుగు దేశం పార్టీ హయాంలో వైద్య సేవలు అందక పేదలు విలవిలలాడారు. ఓ వైపు ప్రభుత్వ ఆసుపత్రులపై పర్యవేక్షణ లేకపోవడం మరో వైపు ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్మరించడంతో విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. ప్రాథమిక స్థాయి నుంచి జిల్లా స్థాయి ఆస్పత్రి వరకు సేవలు అరకొరగా అందేవి. మందు బిల్లలు ఉండేవి కావు. ఈ కారణంగా పేదలకు వైద్య కష్టాలు భారంగా మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలులోకి వచ్చాక వైద్య సేవల్లో వేగం పెరిగింది. పల్లెల్లోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు వెలిసి ఫ్యామిలీ డాక్టర్ సేవలు తలుపుతట్టాయి. నడవలేని స్థితిలో ఉంటే డాక్టరే ఇంటి వద్దకు వెళ్లి బాగోగులు చూస్తున్నారు. కావాల్సినన్ని మందులను అందుబాటులో ఉన్నాయి. జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామాల్లోనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తోంది. మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

నేటి నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు జారీ

వార్షికాదాయం రూ.5 లక్షల కంటే తక్కువ ఉన్న వారికి, తెల్లరేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద 5.40 లక్షల కుటుంబాలకు కార్డులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు అత్యంత సులభంగా పొందేందుకు గాను కొత్తగా, అధునాతనంగా ఈ కార్డులు రూపొందించారు. వీటిని ఈ నెల 18వ తేదీన నూతన మార్గదర్శకాలు జారీ చేయనున్నారు. అదే రోజు గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, గృహ సారథులు, వలంటీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నారు. ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తృతం చేయాలని వారికి దిశా నిర్దేశం చేయనున్నారు. అనంతరం ఆయన కొత్తగా రూపొందించిన కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు.

ఆరోగ్యశ్రీ ఆయుష్షు పోస్తుంది



రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ఆయుష్షు పోస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. ఈరోజు పేదలు సైతం కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకుంటున్నారంటే అది నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కారణం.

– సిద్దయ్య, సాంబవరం, గోస్పాడు మండలం

పెంపు పేదలకు వరం



ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఓ వరం. పేదలు గతంలో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలంటేనే భయపడేవారు. ఎంతటి చిన్నవ్యాధి అయినా రూ.5వేలు ఉండాలి. పెద్ద జబ్బు అయితే లక్షలాది రూపాయలు కావాలి. కాని నేడు ఆ పరిస్థితి లేదు. మాలాంటి పేదలకు రూ. 25 లక్షల వరకు ప్రైవేటు ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చట. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలుస్తూ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడం వరంగా మారింది.

– కాలూరి మద్దిలేటి, ఎర్రగుంట్ల గ్రామం, బండిఆత్మకూరు మండలం

పైసా కూడా చెల్లించవద్దు



పైసా చెల్లించకుండా ఎంతటి రోగానికి అయినా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది. పేదలకు మెరుగైన చికిత్స అందుబాటులోకి తీసుకు రావడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం రూ.5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొందిన వారు ఎక్కడా పైసా కూడా కట్టక్కర్లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కౌంటర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం.

– రూపేంద్రనాథరెడ్డి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్, నంద్యాల

శ్రీగిరి కిటకిట



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రధాన క్యూ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీశైలక్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిటకిటలాడాయి. పాతాళగంగలో పుణ్యస్నానాలనంతరం భక్తులు మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకున్నారు. దీంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

జనం ఆశీస్సులు జగనన్నకే

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొత్త బురుజులకు చెందిన టీడీపీ నాయకులు

బేతంచెర్ల: జనరంజక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే జనం ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బేతంచెర్ల పట్టణంలోని మంత్రి బుగ్గన స్వగృహంలో మంత్రి బుగ్గన వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కొత్తబురుజు గ్రామస్తులు రంగనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిమ్మయ్య, ఎంపీటీసీ నారాయణ, వెంకటరామిరెడ్డి, ఉసేన్ పీరా ఆధ్వర్యంలో పింజరి పక్కీరప్ప, రహిమాను, మాదిగ చిన్న ఓబులేసు, పెండకంటి ఓబులేసు, పెద్దయ్య, వెంకటేష్, నారాయణ, రామాంజి, సుంకయ్య, బ్రహ్మయ్య, రవి, వంశీ, మద్దిలేటి, హుసేనీ, అశోక్, సురేష్, వెంకటరాముడు, గోవింద్, జరికొండ, బలరాముడు ఈశ్వరయ్య, బలరాజు, చిన్న కేశన్న తో పాటు మరో 27 మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం మంత్రి బుగ్గన మాట్లాడుతూ గ్రామ సచివాయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించామన్నారు. రూ.350 కోట్లతో ఇంటింటికి కుళాయి కనెక్షన్‌తో పాటు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి శుద్ధమైన నీటిని అందజేస్తామన్నారు. హంద్రీనీవా జలాలతో చెరువులు నింపి రైతులకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో డోన్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మండల యూత్ ప్రెసిడెంట్ దొరపల్లి చిరంజీవి, బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరక్టర్ మూర్తుజావలి, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ డైరక్టర్ ఖాజా హుసేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ పాల్గొన్నారు.



ముక్తిప్రదాయం.. ధనుర్మాసం

- అహోబిలంలో శాస్త్రోక్తంగా పూజలు ప్రారంభం
- ప్రత్యేక అలంకరణలో గోదాదేవి దర్శనం

ఆళ్లగడ్డ: అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీ రంగ రాజయతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఆది వారం ధను ర్మాస పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దిగువ అహోబిలంలోని యాగశాలలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాముల ఎదురుగా గోదాదేవి అమ్మ వారిని కొలువుంచి నవకళశస్థాపన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించి ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తి గోదాదేవి అమ్మవారిని ఆలయ ఆవరణలోని గోదాదేవి ఆలయంలో కొలువుంచారు.

ధనుర్మాస విశిష్టత..

సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశిస్తాడు కాబట్టి ఈ మాసాన్ని ధనుర్మాసం అంటారు. ధనుర్మాసం విష్ణు మూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైంది. నెల రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు వేడుకగా జరుగుతాయి. మొదటి 15 రోజులు చెక్కర పొంగలి నైవేద్యంగా సమర్పిస్తారు. తర్వాతి 15 రోజులు దద్దోజనం సమర్పిస్తారు. గోదాదేవి అమ్మవారు రాసి పాడిన తిరుప్పావై (స్వామిని స్తుతిస్తూ రాసిన పాట) తో ఆలయ పండితులు ఆలపిస్తారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన తిరుప్పావై పాటలు భోగి రోజున గోదా రంగనాథ కల్యాణంతో ముగుస్తాయి. పెళ్లి కాని అమ్మాయిలు ఈ మాసంలోని నెల రోజులు శ్రీకృష్ణుడికి తులసి మాల సమర్పిస్తే నచ్చిన వరుడితో వివాహం జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు.



భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

ఫలితాలు 'పది'లమయ్యేలా!

- పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు
- వంద రోజుల కార్యక్రమం అమలుకు పకడ్బందీ చర్యలు
- 50 మంది ఉపాధ్యాయ బృందంతో 'సెల్ఫ్' ప్రణాళిక అమలు



నంద్యాల మండలం చాపిరేవుల జిల్లా పరిషత్ పాఠశాలలో సెల్ఫ్ టెస్టు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలతో విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోంది. బోధన, అభ్యాసనకు అనువుగా విద్యాలయాలను తీర్చిదిద్దుతోంది. జిల్లాలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచనల మేరకు డీఈఓ సుధాకర్‌రెడ్డి వంద రోజుల ప్రణాళికను పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. పదో తరగతిలో వంద శాతం ఫలితాల సాధనతో పాటు అధిక మంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించేలా సెల్ఫ్ ఎవెల్యూషన్ ఫర్ లెర్నింగ్ అండ్ ఫ్యూచర్ (సెల్ఫ్) పేరుతో వినూత్న కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. సబ్జెక్టుకు ఆరుగురు చొప్పున నిష్ణాతులైన 42 మంది టీచర్లు, ఏడుగురు ప్రధానోపాధ్యాయులు, డీసీఈబీ కార్యదర్శి మొత్తం 50 మంది బృందంతో ఈ ప్రణాళికను రూపొందించారు. దీని ప్రకారం ఈ నెలాఖరుకు సిలబస్ పూర్తిచేయనున్నారు.

సబ్జెక్టు వారీగా పరీక్షలు..

సబ్జెక్టు వారీగా మొత్తం సిలబస్‌ను ఏడు భాగాలుగా చేశారు. ఒక్కో భాగం పూర్తి చేయడానికి నిర్ణీత సమయం కేటాయించారు. పాఠ్యాంశ బోధన పూర్తయిన వెంటనే సెల్ఫ్ టెస్టులు నిర్వహించారు. ఒక్కో టెస్టుకు గంట సమయం కేటాయిస్తూ 20 మార్కులకు పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 456 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 32,844 మంది పదో తరగతి విద్యార్థులకు ఈ సెల్ఫ్ టెస్టుల షెడ్యూల్ ఇటీవల ముగించారు. వీటితో పాటు ఇటీవల ముగిసిన ఎస్ఏ–1 పరీక్షకు ముందు ప్రిపరేషన్‌లో భాగంగా ప్రీ ఎస్ఏ–1 మోడల్ పరీక్షను కూడా నిర్వహించారు. మాన్యువల్‌గా నిర్వహించే ఈ పరీక్షకు అవసరమైన ప్రశ్నపత్రాల మెటీరియల్ జిల్లా పరీక్షల నిర్వహణ మండలి (డీసీఈబీ), జిల్లా విద్యాశాఖ స్వీయ ఖర్చుతో అందజేసింది.

అదనపు తరగతులతో సత్ఫలితాలు..

సెల్ఫ్ ప్రణాళిక అమలు నేపథ్యంలో పదో తరగతికి పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు ప్రతి రోజు అదనంగా బోధనా తరగతులను విద్యాసంవత్సరం తొలిరోజు నుంచి నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ క్లాసెస్ చేపట్టారు. సాధారణంగా ఉన్నత పాఠశాలలో ఏడాదికి వెయ్యి గంటల బోధనా తరగతులు ఉంటాయి. ఈ స్టడీ క్లాసెస్, సెల్ఫ్ టెస్ట్‌లను కలుపుకొని అదనంగా మరో 434 గంటల సమయాన్ని ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు అభ్యాసన సాగిస్తున్నారు. ఇది ఫలితాలపై మంచి ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

తాజాగా వంద రోజుల ప్రణాళిక

సెల్ఫ్ ప్రణాళికలో భాగంగా సిలబస్ పూర్తయిన తర్వాత అమలు చేయాల్సిన 100 రోజుల ప్రణాళికను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. సెల్ఫ్ కొనసాగింపుగా చేపడుతున్న ఈ ప్రణాళికలో మూడు సెల్ఫ్ టెస్టులు ఉంటాయి. మొత్తం 7 భాగాల సిలబస్‌ను కలిపేసి మూడు భాగాలుగా విభజిస్తారు. ఒక్కో భాగంపై టీచర్ రెండోసారి బోధన అనంతరం పబ్లిక్ పరీక్ష మాదిరిగా 100 మార్కులతో ఒక సెల్ఫ్ టెస్ట్ పెడతారు. ఇలా మూడు టెస్టులు పూర్తయిన తరువాత మొత్తం సిలబస్ మూడు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారు. చివరిగా మొత్తం సిలబస్ మీద ఒక సెల్ఫ్ ప్రీ ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఈ ఏడాది పాటు నిర్వహించిన సెల్ఫ్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు కలుపుకొని ఒక్కో సబ్జెక్టుకు 640 మార్కుల ప్రశ్నావళిని విద్యార్థులు ప్రిపరేషన్‌గా ఎదుర్కొంటారు.

ఉత్తమ మార్కుల సాధనే లక్ష్యం



వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదోతరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలతో పాటు ప్రతి ఒక్కరూ 500 పైబడి మార్కులు సాధించేలా ప్రణాళికలు రూపొందించాం. దీనికోసం సెల్ఫ్ అనే ప్రొగ్రాం జిల్లా విద్యాశాఖ యంత్రాంగం రూపొందించింది. దానిని అమలు చేస్తూ విద్యార్థి ప్రగతిపై ప్రతి 15 రోజులకు నివేదిస్తారు. డివిజన్ పరిధిలో డిప్యూటీ ఈఓలు, మండల పరిధిలో ఎంఈఓ–1, 2 పర్యవేక్షణలో ఈ ప్రణాళికను అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

లక్ష్య సాధనకు..

పదోతరగతి ఫలితాల్లో నిర్దేశిత లక్ష్యం చేరుకునేందుకు వంద రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఇటీవల జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలో అమలు చేస్తున్న సెల్ఫ్ ప్రణాళిక కొనసాగింపుగా 100 రోజుల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు పాటించాల్సిన అంశాలను జిల్లా విద్యాశాఖ ప్రకటించింది.

- మొదటిగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ 100 రోజుల ప్రణాళికను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.
- సబ్జెక్టు వారీగా ఏ సబ్జెక్టుకు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో దానికి అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు స్వీయ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.
- తల్లిదండ్రులు, విద్యార్థులతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి వందరోజుల ప్రణాళిక అమలు ప్రాధాన్యతను వివరించి వారిని సంసిద్ధం చేయాలి.
- సెల్ఫ్ పరీక్ష నిర్వహించిన వెంటనే మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందజేయాలి. వారు చేసిన తప్పులను వివరించి నోట్స్‌లో సరైన సమాధానాలు రాసి పూర్తిస్థాయిలో సాధన చేయించాలి.
- సెల్ఫ్ టెస్ట్ పూర్తయిన తరువాత అన్ని సబ్జెక్టుల్లో ఫలితాలను విశ్లేషించి ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించాలి. ఫలితాలు తక్కువ వచ్చిన సబ్జెక్టు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తదుపరి కార్యాచరణ ప్రణాళికను తయారు చేసి అమలు చేయాలి.
- 100 రోజుల ప్రణాళికను తల్లి దండ్రులకు తెలియజేయడం కోసం స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో విద్యార్థి ఇంటిని సందర్శించాలి.
- విద్యార్థులను దత్తత తీసుకున్న ఉపాధ్యాయుల తల్లి దండ్రులతో వారి ప్రగతి గురించి మాట్లాడిస్తూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడానికి వారిని భాగస్వామ్యం చేయాలి.

క్లుప్తంగా

సీఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ వీర మరణం

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కాల్పుల్లో మృతి


సుధాకర్‌రెడ్డి (ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ గొంగటి సుధాకర్‌రెడ్డి (53) ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం ఉదయం మావోయిస్టు కాల్పుల్లో వీర మరణం పొందారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి 30 ఏళ్ల క్రితం సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికై విధుల్లో చేరారు. నాలుగు ఏళ్ల క్రితం ఏఎస్‌ఐగా పదోన్నతి పొంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పనిచేస్తున్నారు. ఇటీవలే ఆయనకు ఎస్‌ఐగా పదోన్నతి లభించింది. కాగా శిక్షణ పూర్తి చేసుకుని ఎస్‌ఐగా విధుల్లో చేరాల్సి ఉండగా ఇంతలోనే విషాదం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో మృతి చెందారు. మృతునికి భార్య నాగలక్ష్మి, కుమారులు సూర్యచైతన్య రెడ్డి, జయ గణేష్‌రెడ్డి ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి ఏఎస్‌ఐ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం స్వగ్రామమైన వెలగటూరులో పోలీసు అధికార లాంఛనాలతో అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృత్యువాత

ప్యాపిలి: కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై పోతుదొడ్డి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ విశ్వనాథం (45) మృతి చెందాడు. హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తున్న లారీ పోతుదొడ్డి వద్దకు రాగానే స్టీరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ విశ్వనాథం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మిగనూరు హెడ్‌కానిస్టేబుల్‌కు అవార్డు


సుభాన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏసీ సుబాన్ శనివారం డీజీపీ డిస్క్ అవార్డును విజయవాడలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. శాంతిభద్రతల విషయంలో చక్కటి ప్రతిభను కనబరచినందుకు 2022 సంవత్సరానికి తనకు ఈ పురస్కారం వచ్చిందని ఆదివారం ఆయన విలేకరులకు తెలిపారు. బాధ్యత పెరిగిందని, విధులను ఇంకా సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. అవార్డు అందుకున్న హెచ్‌సీ సుబాన్‌కు ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, టౌన్ సీఐ మదుసుధన్‌రావు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది అభినందించారు.

ప్రణాళికతో చదివితే కొలువు సులువు

- గ్రూప్స్ సన్నద్ధతలో ఆత్మస్థైర్యం చాలా ముఖ్యం
- పరీక్షల్లో రాణించాలంటే ప్రణాళిక అవసరం
- విశ్లేషణాత్మక అభ్యాసన కీలకం
- సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై ఉచిత అవగహన సదస్సు
- సదస్సుకు హాజరైన సీఎస్‌బీ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ ర్యాంకర్ బాలలత


మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ బాలలత


సదస్సుకు హాజరైన గ్రూప్స్ పరీక్షకు సన్నద్ధమవుతున్న యువతీ, యువకులు

కర్నూలు సిటీ: సివిల్స్, గ్రూప్స్‌లో విజయం సాధించడానికి చక్కని ప్రణాళికతో చదవాలని సీఎస్‌బీ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ ర్యాంకర్ బాలలత తెలిపారు. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు టీజీవీ లలిత కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు భారీ సంఖ్యలో యువతీ, యువకులు హాజరయ్యారు. సదస్సులో ముఖ్యవక్తగా బాలలత మాట్లాడుతూ.. నేడు చిన్న చిన్న ఉద్యోగాలకు చాలా కష్టపడి చదువుతున్నారన్నారు. గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ఇంకా ఎంత కష్టం ఉంటుందోనని చాలా మందికి భయం ఉంటుందన్నారు. చక్కని ప్రణాళికతో ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే గ్రూప్స్, సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం అనేవి పోటీ పరీక్షల్లో సమస్యే కాదని, నిత్యం తెలుగు పేపర్లతో పాటు, ఇంగ్లిష్ న్యూస్ పేపర్లను చదవుతూ అందులోని ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకోవాలన్నారు. అలాగే 6 నుంచి 12 తరగతుల వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, ఇవీ సాధ్యం కాకపోతే ప్రభుత్వం పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలను చదవాలన్నారు.

సిలబస్‌పై అవగాహన ఉండాలి

ప్రతి వ్యక్తి జీవితంలో ఒడిదుడుకులు సహజమని, సమస్య వచ్చిందని, కష్టమని పోరాటం నిలిపేస్తే అక్కడికే జీవితం ముగుస్తుందని బాలలత అన్నారు. గ్రూప్స్ సన్నద్ధం అయ్యే వారు ముందుగా సిలబస్‌పై అవగహన పెంచుకోవాలన్నారు. ఏ సబ్జెక్టుకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది? ఏఏ అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి? కఠినమైన సబ్జెక్టును ఏ సమయంలో చదవాలి? అనే అంశాలపై ఓ ప్రణాళిక వేసుకోవాలన్నారు. పోటీ పరీక్షల్లో ప్రశ్నల సరళి తెలుసుకునేందుకు పాత ప్రశ్న పేపర్లను ప్రాక్టీస్ చేస్తూ ఉండాలని సూచించారు. చాలా మంది పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యాక ప్రాక్టీస్ మొదలు పెడతారని, అలా చేస్తే సక్సెస్ అనేది చాలా తక్కువగా ఉంటుందన్నారు. ప్రతి రోజు కనీసం 50 బిట్లు అయినా ప్రాక్టీస్ చేస్తూ ఉండాలన్నారు. తరుచుగా న్యూస్ పేపర్లు చదువుతూ కరెంట్ ఆఫైర్స్‌తో సబ్జెక్టును కలుపుకుని విశ్లేషణాత్మకంగా సన్నద్ధం కావాలన్నారు. పరీక్షల సమయంలో ఆత్మస్థైర్యం తగ్గకుండా స్ఫూర్తిదాయకమైన అంశాలను గుర్తుకు తెచ్చుకుంటూ చదవాలన్నారు. సదస్సులో సాక్షి బ్రాంచ్ మేనేజర్ సతీష్ రావు, బ్యూరో ఇన్‌చార్జ్ రవికుమార్, యాడ్స్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపారు



ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో సివిల్స్ సన్నద్ధం అవుతున్నా. డబ్బులు పెట్టే స్థోమత లేకపోవడంతో ఉచిత కోచింగ్ కోసం స్కాలర్‌షిప్ పరీక్ష రాస్తూ కోచింగ్ తీసుకుంటున్నా. ఢిల్లీలో కోచింగ్ తీసుకున్నా..ప్రస్తుతం హైదరాబాదులో కోచింగ్‌కు హాజరవుతున్నా. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీకి చెందిన బాలలత మేడం మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి. పోటీ పరీక్షల్లో రాణించాలంటే ముందుగా ఆత్మస్థైర్యం అనేది చాలా కీలకం. పరీక్షల సన్నద్ధత, సిలబస్ తదితర అంశాలపై బాలలత మేడం వివరించిన తీరు ఆకట్టుకుంది. గ్రూప్స్–1, గ్రూప్–2, సివిల్స్ పోటీ పరీక్షలపై అవగహన సదస్సు నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– సరస్వతి, హొళగుంద

స్పష్టత వచ్చింది



ప్రస్తుతం సచివాలయం ఉద్యోగం చేస్తున్నాను. 2018 నుంచి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. ఇటీవలే ఎస్‌ఐ పరీక్షలు రాశాను. స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. గ్రూప్స్ పరీక్షలు అంటేనే చాలా పోటీ ఉంటుంది. ఈ పోటీలో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాల లత మేడం చెప్పే సలహాలను యూట్యూబ్‌లో చూసేవాళ్లం. ఈ రోజు నేరుగా ఆమె క్లాసు వినే అవకాశం కల్పించిన సాక్షి మీడియా గ్రూప్‌కు ధన్యవాదాలు. పోటీ పరీక్షలకు తొలిసారి సన్నద్ధం అయ్యేవారు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించాలి, ప్రణాళిక ఏ విధంగా తయారు చేసుకోవాలి అనేదాని స్పష్టత వచ్చింది.

– భూపతి, సచివాలయం ఉద్యోగి

సాక్షి మీడియాకు ధన్యవాదాలు



గ్రూప్స్ పరీక్షల సిలబస్ గురించి బాలలత మేడం చాలా బాగా వివరించారు. పరీక్ష అంటే మొత్తం సిలబస్ చదవాలని కాకుండా ప్రాధాన్యత అంశాలు, కరెంట్ అంశాలకు జోడించి విశ్లేషణాత్మకంగా చదువుకోవాలని చెప్పారు. తక్కువ సమయంలో కూడా ఈ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావొచ్చునో చక్కగా వివరించారు. సాక్షి పత్రికలో గ్రూప్స్ పరీక్షల గురించి వచ్చే అంశాలను రెగ్యులర్‌గా ఫాలో అవుతుంటాం. సబ్జెక్టుల విశ్లేషణ బాగుంటుంది. కరెంట్ అఫైర్స్ యాప్స్ బాగా ఉపయోగపడుతుంది. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్‌కు ధన్యవాదాలు.

– పావని, కర్నూలు

మంచి కార్యక్రమం



గ్రూప్స్ పరీక్షలు సమయం తక్కువగా ఉన్నా ఎలా ప్రిపేర్ కావాలి అనే అంశంపై మంచి కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగం చేస్తూనే ఈ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాను. నిరుద్యోగ అభ్యర్థులకు సిలబస్, పరీక్షల సన్నద్ధతతపై అవగాహన కల్పించేందుకు సాక్షి మీడియా గ్రూప్ వారు నిర్వహించిన సదస్సు చాలా చక్కగా ఉంది.

– జి.వరలక్ష్మి, క్రిష్ణానగర్, సచివాలయ ఉద్యోగి

చాలా చక్కగా చెప్పారు



గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అభ్యర్థులకు ఉచితంగా అవగాహన కల్పిస్తున్నారని పేపర్‌లో చూశాను. సదస్సులో పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలో చక్కగా వివరించారు. ఎలాంటి అంశాలపై ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వాలో చెప్పారు. కరెంట్ అఫైర్స్ ప్రాముఖ్యత తెలియజేశారు. 9 నెలల నుంచి గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతున్నాను. ఈ సదస్సు తరువాత నేను గ్రూప్స్ సాధించగలననే నమ్మకం కలిగింది. పరీక్షల్లో వచ్చిన మార్పులు, ప్రశ్నల సరళి గురించి వివరించిన తీరు ఆకట్టుకుంది.

– మధుబాల, నిడ్జూరు గ్రామం, కర్నూలు మండలం

ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


డాక్టర్ డబ్ల్యు. సీతారామ్‌కు జ్ఞాపిక అందిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): వైద్యులు, వైద్య విద్యార్థులు ఆధునిక వైద్యవిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ డబ్ల్యు. సీతారామ్ చెప్పారు. డాక్టర్ వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలో జోనల్ స్థాయిలో రేడియాలజీ, ఆప్తల్మాలజీ విభాగాలు నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు(సీఎంఈ)లు నిర్వహించాయి. రేడియాలజీ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ డబ్ల్యు. సీతారామ్ మాట్లాడుతూ ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో సూక్ష్మలోపాలు సైతం గుర్తించి సరిచేసేందుకు వీలవుతోందన్నారు. ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో జరిగిన ఆప్తల్మాలజీ జోనల్ సీఎంఈకి ముఖ్య అతిథిగా కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్ హాజరయ్యారు. డయాబెటీస్ రోగుల్లో వచ్చే పలు రకాల కంటి జబ్బుల గురించి పలువురు కంటి వైద్యులు వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, డాక్టర్ సాయిసుధీర్, హెచ్‌వోడీలు డాక్టర్ రాధారాణి, డాక్టర్ రేవతి, రేడియాలజిస్టులు డాక్టర్ జోజిరెడ్డి, డాక్టర్ గఫూర్, డాక్టర్ సురేష్, కంటి వైద్యులు డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ భరణీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

గోనెగండ్ల: హెచ్. కైరవాడి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరుకు చెందిన ఉప్పరి ఉరుకుంద అనే వ్యక్తి ఆదివారం బళ్లారిలో తమ సమీప బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా హెచ్. కైరవాడి గ్రామ సమీపంలో నడిచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉరుకుందుకు తీవ్ర గాయాలు కావడంతో 108లో కోడుమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి గురించి పోలీసులు విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎఫ్‌ఆర్‌ఓ ఆఫీసర్స్ నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న దినేష్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(సిటీ): ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కర్నూలు సర్కిల్ పరిధిలోని నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాయలసీమ ప్రాంతీయ కార్యదర్శిగా ఎస్‌సీ సుబ్బరాయుడు, జాయింట్ సెక్రటరీ సుదర్శన్ తెలిపారు. ఆదివారం శిరివెళ్ల మండలం పచ్చర్లలో జరిగిన ఎఫ్ఆర్‌ఓ అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఈ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఓ అసోసియేషన్ అభివృద్ధికి నూతన కార్యవర్గాన్ని ఎర్పాటు చేశామన్నారు. అడిషనల్ జాయింట్ సెక్రటరీగా సుదర్శన్‌ను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజనల్ అధ్యక్షులు సుభాష్, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ అలీ, కోశాధికారిగా జెడ్‌ఎస్ రూ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు కర్నూలు స్విమ్మర్లు


జాతీయ పోటీలకు ఎంపికైన కర్నూలు స్విమ్మర్లు

కర్నూలు (టౌన్): పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 9వ సబ్ జూనియర్ జూనియర్ వింటర్, అక్వాటిక్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు స్విమ్మర్లు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 7 బంగారు, 6 వెండి, 7 కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. భువనాదిత్య (1500 మీటర్లు, బంగారు), వై. దేవవ్రత్ సాయి (200, 400, 800 మీటర్లు బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీస్టైల్, 100 మీటర్లలో కాంస్యం), సామియా తస్నీం (200 మీటర్ల బటర్ ఫ్లై 400 మీటర్ల ఐఎంలో బంగారు), కే. కృతి 400, 200 మీటర్లు ఫ్రీస్టైల్‌లో (వెండి), మౌనిక (50 మీటర్లు బ్యాక్‌స్ట్రోక్‌లో వెండి), అనిల్ (200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య), కే. మనీష్ అశ్విన్ (200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య), టి. వెర్షిక (50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో కాంస్య) పతకాలు సాధించారు. పతకాలు సాధించిన స్విమ్మర్లను నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభినందించారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ సురేష్, స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంక్షేమానికి చర్యలు

- జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు


జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు, ఏటీవో రఘువీర్‌లను సత్కరిస్తున్న పెన్షనర్లు

కర్నూలు (అగ్రికల్చర్): పెన్షనర్ల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు తెలిపారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఆదివారం అబ్బాస్‌నగర్‌లోని కర్నూలు పెన్షనర్ల సంక్షేమ సంఘం కార్యాలయం ప్రాంగణంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ డీడీ మాట్లాడుతూ... పెన్షనర్లు సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ... పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఈ రోజు ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారంటే ధరమ్ స్వరూప్ నకారా చేసిన పోరాట ఫలితమేనన్నారు. 1983 నుంచి ప్రతి ఏటా... డిసెంబర్ 17న పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 75 ఏళ్ల పైబడిన పెన్షనర్లు 30 మందిని సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం సెక్రటరీ బి.జయచంద్రారెడ్డి, ఇతర నాయకులు గోవిందరాజులు, శేషయ్య, విజయకుమార్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న 'గ్యాప్'

- కెమికల్స్ లేని పంటల ఉత్పత్తి దిశగా ప్రభుత్వం చర్యలు
- గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌తో జిల్లాలో వరిసాగు
- ఫైలెట్ ప్రాజెక్టు కింద సి.బెళగల్ మండలం కొండాపురంలో సాగు
- తగ్గిన పెట్టుబడి వ్యయం
- ఆర్గానిక్ సర్టిఫికెట్ జారీ కోసం శాంపిల్స్ పంపిన అధికారులు
- నేడు గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేయనున్న సీఎం వైఎస్ జగన్


కొండాపురం గ్రామంలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ పద్ధతులతో సాగు చేసిన వరి పంట

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో అధిగ దిగుబడులు సాధించడమే లక్ష్యంగా రైతులు అడ్డూఅదుపులేకుండా పురుగుమందులు వాడుతున్నారు. దీని వల్ల పెట్టుబడి వ్యయం పెరగడంతో పాటు ఆశించిన మేర లాభం ఉండదు. ఈ నేపథ్యంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి నాణ్యమైన పంటల ఉత్పత్తి దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ)తో కలిసి గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(గ్యాప్) పనిచేస్తోంది. ఒకేసారి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం బంద్ చేయిస్తే దిగుబడులపై ప్రభావం పడుతుంది కనుక క్రమంగా వాటి వాడకాన్ని తగ్గించేలా రైతులను చైతన్యం చేస్తోంది. ఇదే సమయంలో ఆర్గానిక్ పంటల సాగు వైపు వెళ్లేలా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక పంటను గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానాలతో సాగు చేయిస్తోంది.

నేడు ఆరానిక్ సర్టిఫికెట్స్ జారీ చేయనున్న సీఎం

వరిసాగులో కెమికల్స్ వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల ప్రస్తుతం వేలాది మంది రైతులు ఆర్గానిక్ ఉత్పత్తులపై దృష్టిసారిస్తున్నారు. 2023–24లో సి.బెళగల్ మండలం కొండాపురం(రంగాపురం) గ్రామంలో మోడల్‌గా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానాలతో వరి సాగు చేశారు. 50 మంది రైతులతో 25 హెక్టార్లలో గ్యాప్ పద్ధతులకు అనుగుణంగా వరి పండించడం విశేషం. పండించిన పంటలను ఆర్గానిక్ ఉత్పత్తులుగా గుర్తిస్తూ సర్టిఫికెట్ జారీ చేయడానికి రంగం సిద్ధమైంది. ఈ ధ్రువీకరణపత్రం ఉండటం వల్ల పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో రెట్టింపు ధర లభించే అవకాశం ఏర్పడింది. ఇప్పటికే అధికారులు ఆర్గానిక్ సర్టిఫికెట్ కోసం శాంపిల్స్ పంపడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నేడు వాటిని జారీ చేయనున్నారు.

అధికారుల పర్యవేక్షణలో వరి సాగు

గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద వరి సాగు పూర్తిగా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుంది. వారం వారం డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించి రైతులకు గ్యాప్ పద్ధతులపై అవగాహన పెంచుతున్నారు. కొండాపురం గ్రామంలో ఈ పద్ధతిలో సాగు చేసిన వరి పంటల్లో వేపచెక్కను ఎక్కువగా వినియోగించడం, గో ఆధారిత పద్ధతులు పాటించడం వల్ల సూక్ష్మ జీవులు విశేషంగా అభివృద్ధి చెంది పైరు ఎదుగుదలకు తోడ్పడుతున్నాయి. వర్షాభావం ప్రభావం ఈ రైతులపై కూడా పడింది. మామూలుగా అయితే ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి 30 బస్తాల వరకు దిగుబడులు వచ్చాయి. అయితే, కెమికల్స్ లేకుండా పండించడం వల్ల గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఏర్పడింది.


భారీగా తగ్గిన పెట్టుబడులు

గ్యాప్ విధానాలకు అనుగుణంగా పంటలు సాగు చేయడం ద్వారా పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. వ్యవసాయంలో అత్యధికంగా ఎరువులు, పురుగుమందులపైనే రైతులు పెట్టుబడి పెడుతున్నారు. వీటి ద్వారానే పెట్టుబడి వ్యయం తడచిమోపెడవుతోంది. చివరకు పండించిన పంటల్లో కెమికల్స్ అవశేషాలు ఉన్నాయని మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడింది. వరి సాగులో ఎకరాకు రూ.45 వేల వరకు పెట్టుబడులు పెడుతున్నారు. గ్యాప్ పద్ధతులు తూచా పాటించడం వల్ల ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు తగ్గుతుంది.

సర్టిఫికెట్ జారీకి ప్రత్యేక వ్యవస్థ

ఇప్పటి వరకు ఆర్గానిక్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు ప్రత్యేక వ్యవస్థ అంటూ ప్రత్యేకంగా లేదు. మొదటి సారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థకు అనుబంధంగా ఏపీ స్టేట్ సేంద్రియ సర్టిఫికేషన్ అథారిటీ ఏర్పాటు చేసింది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సర్టిఫికేషన్ పొందే అవకాశం ఉంది. రైతులు మంచి వ్యవసాయ పద్ధతులు పాటించే విధంగా ప్రభుత్వం ప్రత్యేకంగా వైఎస్ఆర్ పొలంబడి, తోటబడి కూడా నిర్వహిస్తోంది. వీటి ద్వారా కెమికల్స్ తగ్గించడం.. రైతులు సేంద్రియం వైపు వెళ్లే విధంగా అవగాహన కల్పించడం జరుగుతోంది. 2022లో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానాలపై కర్నూలులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణ పొందిన అధికారులు గ్యాప్ పద్ధతులతో రైతులతో వ్యవసాయం చేయించడంపై దృష్టి సారించారు.

కెమికల్స్ అవశేషాలు లేకుండా వరి పండించాం



గ్యాప్‌కు అనుగుణంగా వరి సాగు చేశాము. మేము కొన్నేళ్లుగా సీఎస్‌ఏ సహకారంతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాము. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం లేదు. ఈ ఏడాది కొంతమేర దిగుబడులు తగ్గిపోయాయి. అందుకు బాధ లేదు. ఎందుకంటే కెమికల్స్ లేని బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. మేము పండించిన ధాన్యానికి ఆర్గానిక్ సర్టిఫికెట్ కూడా వస్తుంది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు శాంపిల్స్ పంపారు.

– పి.మధుసూదన్‌రెడ్డి, రైతు, కొండాపురం, సి.బెళగల్ మండలం

క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): ట్టణంలోని పిరమిడ్ పాఠశాలలో ఆదివారం నంద్యాల జిల్లా స్క్వే మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ పోటీలు పబెల్ట్ పరీక్ష, టెక్నికల్ సెమినార్ నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా ఏపీ స్క్వే చైర్మన్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఏపీ ఉపాధ్యక్షుడు నబీ సాహెబ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల బుద్ధి బలం, క్రమశిక్షణ, శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం అలవడుతుందన్నారు. ప్రతిభ చాటిన స్క్వే విద్యార్థులకు బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఆధ్యాత్మిక చింతనకు మార్గం దీక్షలు

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక చింతనకు, మానసిక ప్రశాంతతకు, ఏకాగ్రత, క్రమశిక్షణకు దీక్షలు ఉపయోగపడతాయని రామకృష్ణా విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, అభిరుచి మధు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భద్రావతీ భావనారుషి దేవాలయంలో భవానీ మాలధారులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా గత నాలుగు సంవత్సరాల నుంచి అరుంధతీ నగర్, బైటిపేట, హరిజనపేట, జగజ్జననీ నగర్ తదితర ప్రాంతాల్లోని దళిత, బడుగు, బలహీన వర్గాల వారిని భవానీ దీక్షలను స్వీకరింపజేసి, ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించిన గురు భవానీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని సత్కరించారు.

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యంలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

సేవలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న జయంతి వెంకటేశ్వర్లు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో వాసవీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ జయంతి వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఇంటర్నేషనల్ క్లబ్ డైరెక్టర్ నాగసుప్రజ ఆధ్వర్యంలో జిల్లా కేబినెట్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ త్వరలో నూతన కేబినెట్‌ను ఎన్నుకుంటారన్నారు. మండల స్థాయి నుంచి క్లబ్ సేవలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ నాగరాజు, వైస్ గవర్నర్ రామసుబ్రహ్మణ్యం, అన్ని క్లబ్‌ల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రవక్త జీవితం అనుసరణీయం



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మహమ్మద్ ప్రవక్త జీవితం అనుసరణీయమని ముస్లిం రచయితల సంఘం (మురసం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాయల్ పబ్లిక్ స్కూల్‌లో పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రముఖ ముస్లిం రచయిత మహబూబ్ సాహెబ్ రచించిన ప్రవక్త మహమ్మద్, ప్రవక్త ఇబ్రహీం పుస్తకాలను ఆవిష్కరించారు. మురసం జిల్లా గౌరవ అధ్యక్షుడు ముర్తుజా, ఇసాక్ వలి, కవులు కొప్పుల ప్రసాద్, మహబూబ్ బాషా, ఓబులేసు, మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివాళి

చాగలమర్రి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జీ మరణం బాధాకరమని చాగలమర్రి మండల శాఖ యూటీఎఫ్ అధ్యక్షుడు డెన్ని జాన్సన్, కోశాధికారి గౌస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సాబ్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం చేసిన సాబ్జీ మరణం యూటీఎఫ్‌కు తీరనిలోటన్నారు.

ఏకంగా మట్టలే దొరికాయ్..



కుందూలో గాలానికి చిక్కిన బురద మట్టలను చూపుతున్న యువకులు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు వద్ద కూందునదిలో ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో యువకులు ఆదివారం గాలాలతో చేపలను పట్టే పనిలో నిమగ్నమయ్యారు. చాలా అరుదుగా దొరికే బురదమట్టలు దొరకడంతో యువకులు సంతోషం వ్యక్తం చేశారు. సుమారు ఒక్కో చేప 5కిలోల వరకు ఉన్నాయని, కిలో రూ.250 వరకు విక్రయించుకోవచ్చని చెప్పారు. ఇక చేపల ప్రియులకు ఈ చేపలంటే మక్కువ కూడా.

అన్నదాత ఆనందం

- రైతులను ఆదుకున్న ప్రభుత్వం
- కరువును తరిమిన తెలుగుగంగ
- ఆరు విడతలుగా కాల్వలకు సాగునీరు విడుదల
- ఆశాజనకంగా దిగుబడులు, ధర
- కళకళలాడుతున్న రబీ పంటలు

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ తెలుగు గంగ కాల్వలకు ప్రభుత్వం సరైన సమయంలో సాగు నీరు విడుదల చేయించడంతో రైతుల పంట పండింది. పదిహేనేళ్లుగా లేనట్లుగా దిగుబడులు వరించడం, ఇంతకు ముందెన్నడూ లభించనంతగా ధర ఉండటంతో అన్నదాతల మోమున దరహాసరం విరబూస్తోంది.



ఎర్రగుడిదిన్నె వద్ద కనుచూపు మేర పచ్చగా జొన్న పైరు.



రుద్రవరానికి సమీపంలో కళకలాడుతున్న మినుము

రుద్రవరం: ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి అరకొరగా కురిసిన వర్షాలకు రైతులు సేద్యపు పనులు పూర్తి చేసుకున్నారు. విత్తు విత్తేందుకు సరైన వర్షాలు కురవలేదు.బోరు మోటార్లు ఉన్న రైతులు మాత్రం వరి,మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. సీజన్ కరిగిపోతున్నా చినుకు జాడే లేదు. నీరు లేక వాగులు,వంకలు, కుంటలు,చెరువులు ఒట్టిపోయాయి. ఆ సమయంలో ప్రభుత్వం స్పందించి..తెలుగుగంగ కాల్వల ద్వారా వారా బంధీ పద్ధతిలో సాగు నీరు విడుదల చేసింది. అంతే ఒక్కసారిగా రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. అప్పటికే ప్రభుత్వం రైతు భరోసా కింద పంటలు సాగుకు పెట్టుబడి సాయం అందించింది. అక్కడి నుంచి విస్తారంగా వరి,మొక్క జొన్న,మినుము,పత్తి తదితర పంటలు సాగు చేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం వారాబంది పద్ధతిలో 6 విడతలుగా తెలుగుగంగ కాల్వల ద్వారా సాగు అందించింది. ఆ నీటితో వాగులు,వంకలు,కుటంలు,చెరువులు జల కళ సంతరించుకున్నాయి. అయితే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ పంటలకు వాతావరణం అనుకూలించడంతో దాదాపు ఇరవై ఏళ్ల క్రితం నాటి దిగుబడులు లభించాయి. అంచనాలకు మించి పంటలు పండటం, అనుకున్న దానికన్నా ధరలు పలుకుతుండటంతో అన్నదాతల్లో ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఈ సంతోషంలో రెట్టించిన ఉత్సాహంతో రెండో పంట సాగుకు సిద్ధమయ్యారు. ఇందులో జొన్న, వరి, మినుము,మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. మండలంలోని పేరూరు, ఎర్రగుడిదిన్నె,చిలకలూరు,అప్పనపల్లె,డీ కొట్టాల,శ్రీరంగాపురం, కోటకొండ, రుద్రవరం, నర్సాపురం, మందలూరు, ఆర్.నాగులవరం, టీ.లింగందిన్నె, హరినగరం, ఆలమూరు, చిత్రేనిపల్లె తదితర గ్రామాల పరిధిలో రబీ కింద సాగు చేసిన పంటలు కళకలాడుతున్నాయి. అయితే జొన్న,మినుము పంటలు ప్రస్తుతం కీలక దశలో ఉన్నాయి. ఈ సమయంలో ప్రభుత్వం కాల్వల ద్వారా నీరు విడుదల చేయడంతో రైతన్నలు పంటలకు నీటి తడులు అందిస్తున్నారు. ఈ తడి అన్ని పంటలకు ఊపిరి పోయడంతో పాటు భూగర్భ జలాలు పెరిగాయని తద్వారా బోరు మోటార్ల నుంచి కూడా నీరు సమృద్ధిగా అందుతుందని రైతులు సంతోషంగా చెబుతున్నారు.

మండలంలో రబీ కింద సాగు చేసిన పంటల వివరాలు..

పంట	ఎకరాలు
వరి	6వేలు
జొన్న	8వేలు
మొక్కజొన్న	4వేలు
మినుము	6వేలు



ఆర్.నాగులవరం వద్ద 22వ బ్లాక్ కాల్వలో పారుతున్న నీరు

ప్రభుత్వ చర్యలతోనే గట్టెక్కాం



ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటలు పండక కరువు ఛాయలు అలుముకుంటాయని భావించాం. వ్యవసాయం సాగక కుటుంబ పోషణ భారమై జీవనాలు దుర్భరంగా మారుతాయోమనని ఆందోళన చెందాం. అలాంటి సమయంలో ప్రభుత్వం తెలుగుగంగ కాల్వలకు సాగు నీరు విడుదల చేసి ఆదుకుంది. మొదటి పంటగా ఆరెకరాల్లో వరి సాగు చేసి మంచి దిగుబడులు సాధించాం. ధాన్యం పసిమి ఉండగానే బస్తా (75కేజీలు)రూ.2300 ప్రకారం విక్రయించా.ఆ పంట పూర్తి కాగానే రెండో పంటగా మినుము సాగు చేశా. ఆ పంట కూడా ప్రస్తుతం కీలక దశలో ఉంది. చివరి విడతగా రెండు రోజుల క్రితం కాల్వకు నీరు విడుదల చేశారు. దీంతో పంటకు నీటి తడులు అందించాం. నీటి కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా సరైన సమయంలో వదులుతుండటంతో ఇబ్బందులు తప్పాయి. ఏది ఏమైనా రైతులకనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటం అభినందనీయం.

– మధు,రైతు

వైభవంగా ధనుర్మాస పూజలు ప్రారంభం



మత్స్యావతారంలో శ్రీ వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక పూజలు అందుకుంటున్న శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానం, సంజీవనగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం, తెలుగుపేటలోని శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాల్లో ఆదివారం ధనుర్మాస పూజలు వైభవంగా ప్రారంభించారు. స్వామి వారి మూల విరాట్‌లను సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవలు జరిపించి ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం స్వామివారికి తులసీదళాలతో అష్టోత్తరం శతనామావళి, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేపట్టారు. శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహ ఆలయంలో సాయంత్రం పల్లకీ సేవ జరిపించారు. సంజీవనగర్ రామాలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామికి భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని మత్స్యావతార అలంకారంలో అలంకరించారు. వేద పండితులు ప్రహ్లాదస్వామి, కృష్ణమాచారి, శ్రీకాంత్ శర్మ, సూరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో విద్యార్థులకు పతకాలు



బహుమతులు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి బాలోత్సవ్ పోటీల్లో గురురాజ పాఠశాల విద్యార్థులు 41 బహుమతులు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు మౌలాలి రెడ్డి తెలిపారు. ఆదివారం పాఠశాలలో విజేతలకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ రామకృష్ణారెడ్డి, దస్తగిరి రెడ్డి, డాక్టర్ రవికృష్ణ హాజరై మాట్లాడారు. జాతీయ స్థాయి బాలోత్సవ్ 60 విభాగాల్లో 605 పాఠశాలల నుంచి 16వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రాయలసీమలోనే అత్యధిక బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. వీవీఐటీ బాలోత్సవ్ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రప్రదేశ్ తెలుగు బాషా సంఘం అధ్యక్షుడు విజయ్ బాబు విద్యార్థులను అభినందించారు.

కోలుకోలేక యువకుడి మృతి

రుద్రవరం: ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని కొండమాయపల్లెకు చెందిన రజాఅలీ (23) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. ఆర్థిక సమస్యల కారణంగా రజా అలీ శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలే మృతి చెందాడు. మృతుడికి తల్లి ఉశేనమ్మ ఉంది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దొర్నిపాడు: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. ఆదివారం మండలంలోని అర్జునాపురం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నారన్నారు. అలాగే పీఎం కిసాన్ రాని వారు తప్పని సరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. అలాగే రబీ పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ శీలంపార్వతి, వెలుగు ఏపీఎం బాబు, ఎంఈఓ రామచంద్రయ్య, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు,ఏపీజీబీ మేనేజర్ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ ప్రగతి

నంద్యాల(న్యూటౌన్): విద్యతోనే సమాజ ప్రగతి అని, పాఠశాల విద్యను పటిష్టం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్ హోంలో ఆర్‌జేయూపీ ఆధ్వర్యంలో దేశ భవితకు పునాది విద్యా రంగం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముత్తోజు వీర బ్రహ్మం అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. విద్యాశాఖ అధికారులు రామసుబ్బయ్య, డీటీ శంకర్‌ప్రసాద్, సర్వశిక్షా అభియాన్ ప్లానింగ్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి, కన్నయ్య, గురుస్వామి, ఆర్‌జేయూపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా దూదేకుల సంఘం నూతన అధ్యక్షుడిగా వాసవి దస్తగిరి, ప్రధాన కార్యదర్శి గోల్డ్ దస్తగిరి, కోశాధికారిగా ఉశేనప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నూర్ నర్సింగ్ హోం ఆవరణలో ఆదివారం జిల్లా దూదేకుల సంఘం నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అలాగే జిల్లా గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ మహమ్మద్ హుసేన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నబాబు, క్రాంతి, కార్యదర్శులుగా అబ్దుల్లా, జాకీర్, నాగరాజు, ఖాసీం, మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. డాక్టర్ బాబన్, పర్ల దస్తగిరి పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

నంద్యాల(న్యూటౌన్): మహిళలు హక్కులను పోరాడి సాధించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. ఆదివారం రామకృష్ణా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో మహిళల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. అక్కడ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై అర్జీలు సమర్పించాలని కోరారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 7 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

విద్యార్థులు క్రీడల్లో ముందుండాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ, ఎస్జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ అన్నారు. ఆదివారం నౌమాన్ నగర్ క్రీడామైదానంలో నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఖోఖో, త్రోబాల్, వాలీ బాల్, టెన్నికాయిట్, షాట్‌పుట్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి నారాయణ పాఠశాల ఏజీఎం ప్రశాంత్ బహుమతులు అందజేశారు. నందికొట్కూరు, గిద్దలూరు, మార్కాపురం, నంద్యాల బ్రాంచ్‌ల క్రీడాకారులతో పాటు ప్రిన్సిపాల్ చల్లా రాముడు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆళ్లగడ్డ: అహోబిలంలో పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దిగువ అహోబిలంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం అఖిల భారత పద్మశాలీయ నిద్యాన్న దాన సత్రం నాయకులు తులసీకృష్ణ, కోటా రామయ్య, ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అహోబిలం దేవస్థాన ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాలన్ సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అహోబిలం ప్రధానార్చకులు

నేటి నుంచి కేసీ కెనాల్‌కు సాగు నీరు



చాగలమర్రిలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: కేసీ కెనాల్ కింద సాగు చేసి పంటలు ఎండిపోకుండా ఈ నెల 18వ తేదీ నుంచి 16వ బ్లాక్ కాలువ నుంచి కేసీ కెనాల్‌కు వారం పాటు సాగు నీటిని విడుదల చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జీల నియమించడమనేది తమ పార్టీ అంతర్గత విషయమని, దీనిపై టీడీపీకి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 2014లో బూటకపు హామీలతో గద్దెనెక్కి ఆ తరువాత ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు గ్యారెంటీ..ష్యూరిటీ పేరుతో మరోమారు ప్రజలకు మోసం చేయడానికి బాబు బయలుదేరారని ఎద్దేవా చేశారు. గతంలో రుణాలు మాఫీ చేస్తామని ఇచ్చిన బాండ్లకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సమావేశంలో జెసీఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబులాల్, స్థానిక నాయకులు ఫయాజ్, ముల్లా ఖాదర్‌బాషా, బురాందీన్, జల్సా గౌస్, షేక్.షబ్బీర్, రాచమడుగు రమణ గుప్త, డైరెక్టర్ జాబీర్, పీఎంసీ చైర్మన్లు అబ్దుల్లా, మాబుసున్న పాల్గొన్నారు.

నకారా సేవలు మరువలేం

చాగలమర్రి: ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన పెన్షన్ కోసం పోరాడి సాధించిన డీఎస్ నకారా జ్ఞాపకార్థం డిసెంబరు 17వ తేదీని పెన్షనర్ల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు విశ్రాంత ప్రిన్సిపాల్ పోలిశెట్టి మాట్లాడుతూ ఉద్యోగుల పెన్షన్ సౌకర్యం కోసం డిసెంబరు 17, 1982న జస్టిస్ చంద్రచూడ్ తీర్పుతో పెన్షనర్లకు పెన్షన్ భద్రత కలిగిందన్నారు. ఆ తీర్పు కోసం నకారా ఎంతో పోరాడారని గుర్తు చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(అర్బన్): మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కత్తి ఓబులేసు మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కార్యాలయంలో ఎంఎస్‌పీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి విభాగాల నాయకుల సమావేశం నిర్వహించారు. నంద్యాల జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఇంచార్జ్ సుభాష్ చంద్ర మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో అధికార ప్రతినిధులుగా ప్రభాకర్ మాదిగ, దరగయ్య మాదిగ, ఓబులేసుతో పాటు మిగిలిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

తిరుప్పావై అద్భుత వేదాంత గ్రంథం



డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసంలో నిర్వహించే తిరుప్పావై పాశురాలు అద్భుత వేదాంత గ్రంథమని తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సంజీవనగర్ రామాలయంలో సాయంత్రం టీటీడీ దివ్యప్రభంద ప్రాజెక్ట్, నంది రైతు సమాఖ్య శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలను భక్తులకు వినిపించారు. ఆయన మాట్లాడుతూ గోదాదేవి భగవంతుడినే తన భర్తగా భావించి ధనుర్మాస వ్రతాన్ని నిర్వహించిందని తెలిపారు. అనంతరం మొదటి రోజు మొదటి పాశురాన్ని భక్తులకు వినిపించారు. మంచి అలవాట్లతో జీవించమని తోటి వారికి సహాయపడమని భగవంతుడిని తప్పనిసరిగా ఆరాధించమని ఈ పాశురాలు తెలియజేస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సూరయ్య, శ్రీనివాస్, మధు, డాక్టర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆదర్శం



సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభిస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని యేసే నా రక్షకుడు మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఎద్దుల జోసెఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వేడులను ప్రారంభించారు. ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ఏసు క్రీస్తు అని కొనియాడారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఐఎంఏ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ వసుధ, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నంద్యాల ఐఎంఏ నిలిచిందన్నారు. మీ శత్రువులను కూడా ప్రేమించండి.. నిన్ను ద్వేషించువారి కోసం ప్రార్థించండి అనే అత్యున్నత క్షమా గుణాన్ని ప్రేమాతత్వాన్ని జీసస్ ప్రబోధించారన్నారు. అనంతరం కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి రచించిన క్రీస్తు తత్వం పద్యాలను ఆలపించారు. కొవ్వొత్తులు వెలగించి క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల మెడిసిన్ శాఖాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మదన్ క్రిస్మస్ పర్వదిన సందేశాన్ని వినిపించారు. వైద్యులు మధుసూదన్‌రావు, రాణీప్రమీళ, వెంకటేశ్వర్లు, కిశోర్, ఫ్రాంక్‌మోహన్, శిరీష, సుకుమార్, ఎస్తేర్ కిశోర్, విజయ్‌కుమార్, జెరూష ఫ్రాంక్, నిస్సీ రూఫస్, ప్రతిభాగ్లోరి, ప్రశాంత్, రేచల్, రాబర్ట్‌కెన్నడీ, అరుణకుమారి, శైలజ, సుష్మ పాల్గొన్నారు.



నంద్యాలలో ముందస్తు క్యాండిల్ లైట్ సర్వీస్‌లో పాల్గొన్న ఐఎంఏ వైద్యులు

19న క్యాండిల్ లైట్ సర్వీస్

పట్టణంలోని హోలీ క్రాస్ క్యాథడ్రల్, ఆల్ సెయింట్ చర్చి పాస్టరేట్–2 లో ఈనెల 19వ తేదీన, 20న పాస్టరేట్–1లో (పెద్దచర్చి) ఆలయంలో క్యాండిల్ లైట్ సర్వీస్ (దీపారాధన పండుగ) వేడుకలు నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ కిరణ్‌కుమార్, ట్రెజరర్ బాలయ్య, పాస్టరేట్–1 సెక్రటరీ ప్రభుదాస్, కమిటీ సభ్యులు ఆదివారంతెలిపారు. వారు మాట్లాడుతూ డీనరీ చైర్మన్ రైట్ రెవరెండ్ ఇమ్మానుయేల్ క్రిస్మస్ సందేశాన్ని వివరిస్తారని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



చిన్నవంగలిలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సూరజ్ గ్రాండ్‌లో జరిగింది. 1986–89లో చదివిన వారు 33 సంవత్సరాల తర్వాత కలుసుకొని ఆప్యాయంగా ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎకనామిక్స్ లెక్చరర్ మురళీధర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామసుబ్బయ్య, లలితాసరస్వతి, శంకర్, సురేష్‌రెడ్డి, సత్యనారాయణ, భాస్కర్‌రెడ్డి, వెంకటరమణ, సుబ్బరాయుడు, పాపారాయుడు, సుశీల, నిర్మల, రోజాకుమారి, గాయిత్రి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009–10లో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 13ఏళ్ల తరువాత కలుసుకోవడంతో మిత్రులందరూ నాటి జ్ఞాపకాలు, సరదాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్వ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. హెచ్ఎం సుబ్బారాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతోషాన్ని ఇస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు సుబ్బారాయుడు, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, పూర్వవిద్యార్థులు ఓబులేసు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఉద్యోగుల సంఘం ఎన్నికలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ వ్యవహరించారు. మొత్తం ఏడు పోస్టులకు జరిగిన ఎన్నికలలో 9 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. పోస్టులన్నీ ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడిగా గోవిందు, కార్యదర్శిగా సుబ్బరాయుడు, సహాయధ్యక్షుడిగా కృష్ణ, మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా సుబ్బిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా నూర్‌జహాన్, మల్లికార్జున, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దుర్గాకుమార్, కోశాధికారిగా షరీఫ్ ఎన్నికయ్యారన్నారు. ఏపీ ఎన్‌జీఓస్ కోశాధికారి సతీష్‌కుమార్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు కాటమయ్య, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రమణారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రవికుమార్, ఉపేంద్రలు పాల్గొన్నారు.